క్లుప్తంగా

రూ.10వేలు ఆర్థిక సాయం



వత్సవాయి : మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ద్వారా ఓ దివ్యాంగుడికి రూ.పదివేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. పెనుగంచిప్రోలుకు చెందిన యాదా గోపాలకృష్ణ అనే యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో రెండు చేతులు, కాలు కోల్పోయాడు. అతని ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు కుమార్తె తొండపు ఝాన్సీ పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ద్వారా పదివేల రూపాయలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి నాళ్ల చిన్నసత్యం, చిరునోముల రమేష్, పోకూరి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సత్కారం

నందిగామ టౌన్: ప్రతి ఒక్కరి సహకారంతోనే దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయని ఈవో హరిగోపీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో దసరా ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులను గురువారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ఆయా శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

వీఆర్వోలతో సమీక్ష

వీరులపాడు: వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల వీఆర్వోలతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1.50లక్షల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి గురువారం గుంటూరు జిల్లా కొరిటెపాడుకు చెందిన కారసాని భద్రారెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు వెంకట మంజునాథరెడ్డి రూ.1.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈమేరకు ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో బీహెచ్‌వీఎస్ఎస్ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా విరాళం అందజేశారు. ఈవిరాళం నగదులో రూ.1లక్ష నిత్యాన్నదాన పథకానికి, రూ.50 వేలు అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడానికి వినియోగించాలని కోరారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంషాపుల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

సీపీఐ నాయకుల డిమాండ్



జగ్గయ్యపేట అర్బన్: కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలను దేవాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులను ఏర్పాటుచేయాలని కోరుతూ సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖల అధికారులకు గురువారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ మాట్లాడుతూ పర్మిట్ రూములను కూడా అనుమతించవద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు పాటించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ గురవయ్య మాట్లాడుతూ మద్యం షాపులను నిబంధనల ప్రకారం అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, మెటికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి క్యాడర్ డీలా

- మద్యం షాపులకు కూటమి నాయకులు భారీసంఖ్యలో దరఖాస్తు
- లక్ వరించక దక్కని మద్యంషాపులు
- చేతిలో సొమ్ము పోయిందని ఆవేదన
- రెండురోజులుగా మౌనంగా రోదిస్తున్న చోటామోటా నాయకులు



కంచికచర్ల/నందిగామటౌన్/పెనుగంచిప్రోలు/వత్సవాయి/జగ్గయ్యపేట: నూతన మద్యం పాలసీలో భాగంగా లక్ కుదిరితే మద్యంషాపులను దక్కించుకునేందుకు భారీగా దరఖాస్తు చేసిన నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని టీడీపీ కూటమి నేతలు, చోటామోటా నాయకులు..తీరా లాటరీలో మద్యంషాపులు దక్కకపోవడంతో డీలాపడ్డారు. ఇలా ఈ రెండు నియోజకవర్గాల్లో అనేకమంది కూటమి నాయకులు బృందాలుగా ఏర్పడి మద్యం షాపులను కైవసం చేసుకునేందుకు అధికసంఖ్యలో దరఖాస్తు చేశారు. బడా నాయకులు ఒక్కొక్కరు పదుల సంఖ్యలో దరఖాస్తులు వేయగా, చోటామోటా నాయకులు సైతం ఓ బృందంగా ఏర్పడి భారీగానే దరఖాస్తు చేసుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

- కంచికచర్ల మండలం గనిఆత్కూరులో పలువురు టీడీపీ నాయకులు బృందంగా ఏర్పడి మద్యంషాపుల కోసం 20 దరఖాస్తులు దాఖలు చేయగా ఈ బృందానికి ఒక్క షాపు కూడా రాలేదు.
- కంచికచర్లలో టీడీపీ సానుభూతిపరుడైన ఓ రిటైర్డు టీచర్, అతని మిత్రులు కలిసి 18దరఖాస్తులు వేయగా, లాటరీలో ఒక్క షాపు తగిలింది.
- కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామానికి చెందిన ఓ నాయకుడు 24దరఖాస్తులు వేయగా ఓ షాపు వచ్చింది.
- పెనుగంచిప్రోలులో 30మంది టీడీపీ నాయకులు, సానుభూతిపరులు ఓ బృందంగా ఏర్పడి 36దరఖాస్తులు వేయగా, పెట్రోలు బంకులో పనిచేసే ఓ వ్యక్తిపేరుతో వేసిన దరఖాస్తుకు లాటరీ తగిలింది.
- నందిగామ నియోజకవర్గ ప్రజాప్రతినిధి తరపున రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న కంచికచర్ల మండలానికి చెందిన ఓ ఎంపీటీసీ సభ్యుడు, అతని బృందం కలిపి 70 దరఖాస్తులు వేయగా ఒక్క షాపు కూడా దక్కలేదు.
- తెలంగాణలో మద్యం వ్యాపారం చేస్తున్న పెనుగంచిప్రోలు మండలంలోని ముండ్లపాడుకు చెందిన ఓ కాంట్రాక్టర్ సైతం ఇక్కడి మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోగా ఒక్క షాపు కూడా రాలేదు. దీంతో లాటరీ తగిలినవారి నుంచి ఒప్పందం చేసుకుని పెనుగంచిప్రోలు మండలంలో ఓ షాపు, వత్సవాయి మండలంలో ఓ మద్యంషాపును నిర్వహించేలా ఆయన ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది.
- నందిగామ పాత సిండికేట్ సభ్యుడైన చందర్లపాడు మండల టీడీపీ నాయకుడు స్వంతంగా ఓ 20 దరఖాస్తులు, బృంద సభ్యులంతా కలిసి మరో 30దరఖాస్తులు చేసినప్పటికీ వీరికి లాటరీలో ఒక్క షాపు రాలేదు.
- కంచికచర్ల మండలంలో ఇసుక వ్యవహారంలో తలదూర్చిన ఓ టీవీ మాజీ జర్నలిస్టు కూడా రెండు దరఖాస్తులు చేయగా, లాటరీలో లక్ వరించలేదు.
- వత్సవాయి మండల గ్రామాలకు చెందిన 40మంది టీడీపీ నాయకులు వివిధ సిండికేట్లలో చేరి వత్సవాయి మండలంలోని రెండు షాపులతోపాటు ఇతర షాపులకు కలిపి భారీగా దరఖాస్తు చేసినప్పటికీ వీరికి ఒక్క షాపు కూడా దక్కలేదు.
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోగా షాపులు రాకపోవడంతో నిరాశ చెందారు.
- జగ్గయ్యపేటలో 40మంది వ్యక్తులు కలిసి ఓ సిండికేట్‌గా ఏర్పడి పట్టణంలోని 4షాపులకు ఒక్కో షాపునకు పది దరఖాస్తులు చొప్పున 40 దరఖాస్తులు వేయగా లాటరీలో ఒక్కషాపు కూడా దక్కలేదు.
- జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఓ టీడీపీ సానుభూతిపరుడు 11దరఖాస్తులు చేయగా ఒక్కటి కూడా రాలేదు.



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో టీడీపీ, జనసేన నాయకులు, ఆపార్టీల సానుభూతిపరులే మూడొంతులు మంది మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. మద్యం వ్యాపారంలో మంచిలాభాలు ఉంటాయనే ఉద్దేశంతో పలువురు ఔత్సాహికులు కూడా విడివిడిగా, బృందాలుగా దరఖాస్తు చేసుకోగా తీరా లాటరీలో ఒక్కషాపు కూడా తగలకపోవడం డీలాపడ్డారు. మద్యం షాపు దక్కడం అటుంచి చివరికి చేతిచమురు వదిలించుకున్నామంటూ లోలోన మథనపడుతున్నారు.

ప్రభుత్వానికి రూ.38.66కోట్లు..

జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 33మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆయా దుకాణాలకు ఆయా నియోజకవర్గాలకు చెందినవారితోపాటు విజయవాడ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కూడా భారీగా దరఖాస్తు చేసుకున్నారు. వత్సవాయి మండలంలోని రెండు మద్యం దుకాణాలకు జిల్లాలోనే అత్యధికంగా 252మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 33మద్యం షాపులకు కలిపి 1933మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో షాపునకు దరఖాస్తు ఫీజు కింద రూ.2లక్షలు నిర్ణయించడంతో ఈ 33మద్యంషాపుల కోసం దరఖాస్తుదారులందరూ కలిపి రాష్ట్రప్రభుత్వానికి రూ.38.66కోట్లు చెల్లించారు.

మూడొంతులు సొమ్ము తెలుగు తమ్ముళ్లదే..

మద్యం షాపు దరఖాస్తు ఫీజుగా ప్రభుత్వానికి అందిన మొత్తంలో మూడొంతులు సొమ్ము తెలుగు తమ్ముళ్లదేనని చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చింది..లక్ ఉండి మద్యంషాపు దక్కితే ఇక మనకు తిరుగుండదనే ఉద్దేశ్యంతో టీడీపీ, జనసేన క్యాడర్ మద్యంషాపులకు భారీగా దరఖాస్తు చేసుకుంది. అయితే లాటరీలో ఈ 33 మద్యం దుకాణాల్లో దాదాపు సగంషాపులు విజయవాడ, తెలంగాణ వారితోపాటు ఇతర ప్రాంతాలకు చెందినవారికి దక్కడంతో భారీగానే చేతిచమురు వదిలిందని కూటమి క్యాడర్ లబోదిబోమంటోంది. మద్యంషాపుల పేరుతో చేతిలో ఉన్న సొమ్ము పోయిందని మౌనంగా రోదిస్తున్నారు. మద్యషాపులకు దరఖాస్తు చేశారంటగా..లాటరీ తగిలిందా? అంటూ బంధుమిత్రులు, ఇతర నాయకులు అడుగుతుండటంతో ఏమిచెప్పాలో తెలియక సతమతమవుతున్నారు.

సచివాలయ ఉద్యోగులతో సమావేశం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రతి నెలా గ్రామాల్లో ప్రభుత్వ పింఛన్‌లు పొందే లబ్ధిదారుల జాబితాను సక్రమంగా సరిచూసుకోవాలని ఎంపీడీవో నితిన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారిలో అర్హులైనవారినే ఎంపిక చేయాలన్నారు. ముఖ్యంగా పింఛన్‌ల జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి : సీఐటీయూ

జగ్గయ్యపేట అర్బన్: టీడీపీ కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు షేక్ గౌస్‌మియా, బి.రాము, నాయకులు ఎస్.రామనాథం, కె.రవి,కె.రాంబాబు తదితరులు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను గురువారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఆయా చార్జీల పేరుతో గతంలో ఉన్న ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయన్నారు. వరదల కారణంగా ముంపునకు గురైన కార్మికులకు నష్టపరిహారం అందజేయాలని పనులు కోల్పోయిన వారికి సంక్షేమ బోర్డు ద్వారా భృతిని ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

మహర్షి వాల్మీకికి ఘననివాళి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను, ఉద్యోగులు



వాల్మీకికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉద్యోగులు

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంపీపీ మార్కపూడి గాంధీ పూలమాలవేసి నివాళులర్పించారు. రామాయణం వంటి గొప్పకావ్యాన్ని అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, ఏఓ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

గండ్రాయి(జగ్గయ్యపేట): మండలంలోని గండ్రాయి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. విద్యార్థులు వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి జీవితచరిత్రను ఉపాధ్యాయులు వారికి వివరించారు. ఉపాధ్యాయులు నేలవెల్లి రమేష్ బాబు, సుబ్బారావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ టౌన్: రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదిస్మరణీయుడని ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శ్రీరాముని దివ్య చరితమును శ్రీరామనామ మాధుర్యాన్ని మన కందించిన ఆదికవి వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని కొనియడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని రాఘవాపురంలో వాల్మీకి జయంతి సందర్భంగా గ్రామస్తులు వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి అభిమాన సంఘం నాయకులు కృష్ణారాము, కృష్ణమూర్తి, కృష్ణాశంకర్‌రావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..



కంచికచర్ల : స్థానిక శాఖా గ్రంధాలయంలో వాల్మీకిమహర్షి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకికి నివాళులర్పించిన వారిలో కుక్కమల్ల బాబూరావు, బాలస్వామి, బాజీ, బ్రహ్మం, సీతారాములు, సత్యం ఉన్నారు.



గండ్రాయిలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాఠశాలలో కళావేదిక ప్రారంభం



కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర, బాదె నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాదె నాగేశ్వరరావు తనతల్లిదండ్రులు బాదె సత్యనారాయణ, వీరమ్మ పేరుతో రూ.5లక్షలతో నిర్మించిన కళావేదికను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో కళావేదిక లేకపోవడంతో విద్యార్థులుపడుతున్న ఇబ్బందులను గమనించిన పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు బాదె నాగేశ్వరరావు, రత్నమాల దంపతులు కళావేదిక, జెండాదిమ్మెను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. నాగేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నాగేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైనేని రాధా, పితాని శ్రీనాథ్, కౌన్సిలర్లు గీతారాణి, గింజుపల్లి వెంకట్రావు, విద్యాకమిటీ చైర్మన్ అనురాధ, హెచ్ఎం.మాధవీలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

మంగొల్లు(వత్సవాయి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. మండలంలోని మంగొల్లు గ్రామంలో రూ.35లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల రూపురేఖలు మార్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, సైడ్ కాలువలు, సిమెంట్ రహదారులు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉండే ప్రభుత్వ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెపాక ప్రణీత, పీఆర్ ఏఈ సుందర రామయ్య, మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మన్నె నారాయణ, ఎస్సీ సెల్ నాయకుడు అన్నెపాక దుర్గామహేశ్వరరావు, చావా నాగేశ్వరరావు, బొల్లా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే..అంతే సంగతులు!



చిన్నపాటి వర్షానికే అధ్వానంగా మారిన కంచికచర్ల ఎంపీడీవో ఆఫీసు ఆవరణలోని రోడ్డు



బురదకయ్యను తలపిస్తున్న కంచికచర్ల జెడ్పీ పాఠశాల ప్రాంగణం



గోతులమయమైన కంచికచర్ల నుంచి ఎర్రుపాలెం వెళ్లే రోడ్డు

- చిన్నపాటి వర్షానికే బురదమయమవుతున్న రోడ్లు..
- ప్రమాదాల బారినపడుతున్న వాహనచోదకులు
- రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

కంచికచర్ల : చిన్నపాటి చినుకుపడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం లోతట్టుగా ఉండటంతో చిన్నపాటి చినుకు పడితే చాలు ఆ ఆవరణ అంతా జలశయాన్ని తలపిస్తోంది.

. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం, రైతు భరోసా కార్యాలయం, మండల వనరుల కార్యాలయం, కేడీసీసీ బ్యాంకు, గ్రామసచివాలయం-2, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, డీఆర్‌డీఏ, జాతీయ ఉపాధిహామీ పథకం కార్యాలయంతో పాటు అంగనవాడీ కేంద్రం కూడా ఉంది. దీంతో వర్షాల పడితే రోజుల తరబడి ఈ ఆవరణ అంతా వర్షపునీరు నిలిచి ఉంటుండటంతో ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ప్రజలు, ఆయాశాఖల ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. మూడురోజుల కిందట కురిసిన వర్షానికి ఇప్పటికీ కూడా కంచికచర్లలోని పలురోడ్లలో వర్షపునీరు రోడ్డుపై నిల్వ ఉంది. దీంతో బురదమయంగా మారిన ఈ రోడ్లపై నడిచేందుకు ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. ద్విచక్రవాహనాలు స్కిడ్ అవుతుండటంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో...

కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ అంతా బురదమయంగా ఉండటంతో ఇక్కడ చదువుకుంటున్న 306మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల ఆవరణలో నడిచేసమయంలో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా పడిపోతామేమోననే భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు.

జుజ్జూరు రోడ్డులోనూ ఇదే దుస్థితి..

కంచికచర్ల నుంచి తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం, ఖమ్మం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఈరోడ్డులో ఆయా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో కూడిన బస్సులు, ఆటోలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండటంతోపాటు వర్షపునీరు రోజులతరబడి ఆగోతుల్లో నిలిచి ఉంటుండటంతో వాహనచోదకులు అవస్థలు అన్నీఇన్నీకావు. వర్షపునీరు నిలిచి ఉన్నందున గోతులు ఉన్నట్లు అంచనా వేయలేక వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారంలోకి రాగానే రోడ్లన్నీ అద్దంలా తీర్చిదిద్దుతామన్న పాలకులు ఇప్పటివరకు ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. టీడీపీ కూటమి నాయకులకు ఇసుక, మద్యం దుకాణాలపై ఉన్న శ్రద్ధ, రోడ్లకు మరమ్మతులు చేపట్టడంపై లేదని విమర్శిస్తున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి కంచికచర్లలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు జెడ్పీ పాఠశాల, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షపునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, కంచికచర్ల వాసులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చించరూ...



కొణతాపల్లి(వీరులపాడు): మండలంలోని కొణాతాలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ గుంతపడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండానే ఆయా గ్రామాల ప్రజలు వీరులపాడు మండల కేంద్రానికి, కంచికచర్లకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో రహదారిపై ఉన్న గుంత కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు ఈఎస్ఐ వైద్య శిబిరం

నందిగామటౌన్: పట్టణంలోని శ్రీవిద్యా పాఠశాల ఆవరణలో శుక్రవారం ఈఎస్ఐ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఎస్ఐ లోకల్ కమిటీ సభ్యుడు పూజారి రాజేష్ తెలిపారు. ఈ శిబిరంలో ఆయా విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని వైద్యసేవలందిస్తారన్నారు. ఈఅవకాశాన్ని ఈఎస్ఐ పరిధిలో ఉన్న ఉద్యోగుల కుటుంబాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com